క్లుప్తంగా

ఆదాలకు సన్మానం



నెల్లూరు(బారకాసు) : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు ముస్లిం మైనారిటీ నేతలు వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు ఆదాల ప్రభాకర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి సన్మానించారు. ఆయనతో పాటు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని కూడా సత్కరించి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. షేక్.సందానిబాషా, సయ్యద్ అబ్దుల్ సలీం, మొయినిద్దీన్, అల్లాభక్షు, ఖలీల్, కరిముల్లా, స్వర్ణ వెంకయ్య, కొండేటి నరసింహారావు, చెరుకూరు మధు, బెల్లంకొండ వెంకయ్య ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

నెల్లూరు(పొగతోట) : నేటి నుంచి జరిగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉన్నతంగా రాణించి ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాయాలని సూచించారు.

సీలింగ్ ఫ్యాన్ల వితరణ



నెల్లూరు(బృందావనం) : రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు ఆధ్వర్యంలో ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు ఏడు సీలింగ్ ఫ్యాన్లను ఆదివారం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆ వేదిక అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడు హైటెక్ రమణారెడ్డి, సహాయ కార్యదర్శి గుండాల ప్రతాప్ రెడ్డి, కోశాధికారి హేమంత్‌కుమార్‌రెడ్డి, విజయ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమావేశం

నెల్లూరు (పొగతోట) : ది నెల్లూరు జిల్లా బ్యాంక్ ఎంప్లాయిస్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఆదివారం నగరంలో జరిగింది. బ్యాంకు ఉద్యోగులకు ఐదు రోజుల పనిదినాలు అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు ఉదయ్‌కుమార్, రాంబాబు ఈ సందర్భంగా కోరారు.

రక్తదాన శిబిరం ఏర్పాటు



నెల్లూరు(బృందావనం) : నగరంలోని వీఆర్సీ మైదానంలో 'వీఆర్ విత్ యూ' చారిటబుల్ ట్రస్ట్, సేవ్ యు బ్లడ్‌క్యాంప్ సంయుక్త సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మదీనా వాచ్‌గ్రూప్ అధినేత ఇంతియాజ్ పాల్గొని, రక్తదానం చేస్తున్న యువతను అభినందించి జ్ఞాపికలు అందజేశారు

గుక్కెడు నీరు అందడం లేదు



పర్యటిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలో పెన్నానది పక్కనే ఉన్న జనార్దన్‌రెడ్డి కాలనీ, భగత్‌సింగ్‌కాలనీ, వెంకటేశ్వరపురం ప్రజలకు తాగేందుకు గుక్కెడు నీరు ఇవ్వలేని స్థితిలో పాలకులు ఉన్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆదివారం భగత్‌సింగ్‌కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. స్థానికంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, తాగునీరు అందించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నరసింహ, మూలం ప్రసాద్, జాఫర్, గడ్డం శ్రీనివాసులురెడ్డి, అల్లాభక్షు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : దాడి ఘటనపై ఆదివారం రాత్రి నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వారి సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు ప్రాంతానికి చెందిన ఉమామహేష్, నాగేంద్ర స్నేహితులు. వీరు చేపల విక్రేతలు. ఇటీవల చేపలు విక్రయించగా వచ్చిన నగదు పంచుకునే విషయంలో విభేదాలు పొడచూపాయి. ఈ నేపథ్యంలో ఈనెల 15వ తేదీ రాత్రి ఉమామహేష్‌పై స్నేహితుడు నాగేంద్ర దాడి చేసి గాయపరిచారు. ఈ మేరకు బాధితుడు ఆదివారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్) : బైక్ ఢీకొని వృద్ధుడికి గాయాలైన ఘటన బుజబుజనెల్లూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గుర్తుతెలియని వృద్ధుడు రోడ్డు దాటుతుండగా గూడూరు వైపు నుంచి వచ్చే బైక్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని 108 సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉన్నాడు. వివరాలు తెలియరావాల్సి ఉంది.

రంగడి రథోత్సవం..

భక్తజన పరవశం

లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు



ఎదురుకోలోత్సవంలో లక్ష్మీనృసింహస్వామి, అమ్మవార్లు



రథోత్సవంలో నృత్యాలు చేస్తున్న మహిళలు

వేడుకగా సాగుతున్న రంగనాథుని రథోత్సవం

నెల్లూరు(బృందావనం) : జై రంగ.. జైజై రంగ.. రంగనాథా రక్షమాం.. పాహిమాం.. గోవిందా.. గోవిందా నామస్మరణతో సింహపురి ఆధ్యాత్మిక చింతనతో పరవశించి పులకించింది. భక్తజన సందోహం నడుమ ఆదివారం రంగడి రథోత్సవం కనులపండువగా జరిగింది. విశేష పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దిన తిరుత్తేరులో ఉభయదేవేరులతో సర్వాలంకారశోభితంగా కొలువైన తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవాన్ని వీక్షించేందుకు తరలివచ్చిన వేలాది భక్తజనంతో మాడవీధులు కిటకిటలాడాయి. దాదాపు నాలుగైదు గంటలపాటు రద్దీ కొనసాగింది. రథోత్సవాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డి తదితరులు గుమ్మడికాయతో దిష్టి తీసి, కర్పూర హారతులిచ్చి గొలుసులు లాగి ప్రారంభించారు. రథచక్రాలపై భక్తులు ఉప్పు, మిరియాలు చల్లుతూ, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టారు.

- శ్రీరంగనాథ మిత్రమండలి, భజరంగ్‌దళ్, పలు హిందూ ధార్మిక సంస్థల నిర్వాహకులు, యువత, భక్తబృందాలు రంగడిని, గోవిందుడిని స్మరిస్తూ రథోత్సాహంతో ముందుకుసాగారు.
- కాగా ఎదురుకోలోత్సవంలో పట్టువస్త్రాలను రూరల్ ఎమ్మెల్యే సతీమణి సుజిత, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి సమర్పించారు. కమిషనర్ సూర్యతేజ, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగనాథస్వామి ఉభయదేవేరులతో లక్ష్మీనృసింహస్వామికి పట్టువస్త్రాలను చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జె.శ్రీనివాసరావు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి అందజేశారు.

రంగడికి పొన్నవాహనోత్సవం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా తల్పగిరి రంగనాథస్వామికి ఆదివారం రాత్రి పొన్నవాహన ఉత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. పొన్న వాహనోత్సవం ఉభయకర్తలుగా సిద్ధవరపు రామలింగారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుమంత్‌కుమార్‌రెడ్డి, ఎదురుకోలోత్సవం ఉభయకర్తలుగా కొండేటి సుబ్బారెడ్డి కుమారులు వ్యవహరించారు.



హారతులు తీస్తూ..

భక్తుల సేవలో..



అన్నదానం చేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



సంతపేట శ్రీకాళారెడ్డి సత్రం వద్ద..



రంగనాథ భక్తమండలి, రాజరాజేశ్వరి భక్తమండలి ఆధ్వర్యంలో..



కాశీనాయన ఆశ్రమం ఆధ్వర్యంలో..

నెల్లూరు(బృందావనం) : నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలు సంస్థలు, సంఘాలు, అసోసియేషన్లు, మిత్ర మండళ్లు, భక్తబృందాలు తమ వంతుగా రథోత్సవంలో పాల్గొన్న భక్తులకు ఆకలి దప్పికలు తీర్చారు. పలు రకాల ప్రసాదాలతో శీతల పానీయాలు, పండ్లు, ఐస్‌క్రీమ్‌లు, మినరల్ వాటర్‌ను వితరణ చేశారు.

- స్థానిక నాలుగు కాళ్ల మండపం వద్ద సంతపేట శ్రీకాళారెడ్డి సత్రం ఆధ్వర్యంలో వందలాది మందికి అన్నప్రసాద వితరణ, వేలాది మందికి మినరల్ వాటర్, మజ్జిగను అందజేశారు. అలాగే గోపురం వీధిలో చీదెళ్లవారి సత్రం, పాండురంగ అన్నదాన సమాజం తదితర సంస్థల ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ జరిగింది.
- శ్రీరంగనాథ భక్తమండలి, రాజరాజేశ్వరి భక్తమండలి ఆధ్వర్యంలో నాలుగు కాళ్ల మండపం వద్ద 30 వేల మందికి అన్నసంతర్పణ చేశారు. అలాగే 500 మంది పేదలకు టీషర్టులు, వెయ్యి మందికి టోపీలు అందజేశారు. నిర్వాహకుడు మెంటా రామ్మోహన్‌రావు, బీజేపీ నేతలు పి.సురేందర్‌రెడ్డి, తేలపల్లి రాఘవయ్య, ధార్మిక సంఘాల నేతలు పెన్నక సుజాతమ్మ, మువ్వల సునీల్, మల్లికార్జున, మారం కృష్ణ, సరాబు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.
- మైపాడురోడ్డు వైకుంఠపురం కాశీనాయన ఆశ్రమం ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నప్రసాదం, శీతల పానీయాలు అందజేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిర్వాహకుడు ధన్వి శ్రీనివాస్ పాల్గొన్నారు.
- ది నెల్లూరు డిస్ట్రిక్ట్ రైస్ కాన్వాసింగ్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శేగు షణ్ముఖరావు ఆధ్వర్యంలో పలురకాల ప్రసాదాలు, మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- నెల్లూరు(బారకాసు) : శెట్టిగుంట రోడ్డులో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

బెదిరింపులకు భయపడేది లేదు

- వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాసయాదవ్

నెల్లూరు(బారకాసు) : రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డి ఎలాంటి బెదిరింపులకు పాల్పడినా భయపడే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాసయాదవ్ అన్నారు. నగరంలోని డైకస్‌రోడ్డులో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కొందరిని షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగాల్లో చేర్పించే సమయంలో వారితో తనపై ఆరోపణలు చేయించారన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.లక్షలు తీసుకుని మోసం చేశానని వారు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, దీనిపై అధికారులు కూడా విచారణ జరిపి వాస్తవం లేదని నిర్ధారించారన్నారు. తనపై చేసిన ఆరోపణలపై విచారణ చేసిన విజిలెన్స్ అధికారులకు సమాచార హక్కు చట్టం ద్వారా రిపోర్టు కాపీ ఇవ్వాలని అడిగితే ఇది కాన్ఫిడెన్షియల్ అని నామమాత్రంగానే రిపోర్టు ఇచ్చారన్నారు. తాను కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో లైన్‌మెన్ ఉద్యోగాల రిక్రూట్‌మెంట్ జరగలేదని, అలాంటిది లైన్‌మెన్ ఉద్యోగాలిప్పిస్తానని వారి దగ్గర నుంచి నేను డబ్బులు ఎలా తీసుకుంటానని ప్రశ్నించారు. ఇటీవల కార్పొరేటర్ మొయిళ్ల గౌరి ఎస్ఎంసీ తప్పుల గురించి ప్రశ్నిస్తే అదేరోజు రాత్రి ఎమ్మెల్యే తన అనుచరులతో ఆమెకు చెందిన స్థలంలో గదిని కూలదోసి ధ్వంసం చేయించారన్నారు. ప్రస్తుతం శ్రీధర్‌రెడ్డి ఉంటున్న పార్టీ కార్యాలయం తన స్నేహితుడికి చెందిన స్థలంలోనే ఉచితంగా ఏర్పాటు చేసుకున్నాడన్నారు. అలాగే లెక్చరర్స్ కాలనీలో ఓ డాక్టర్‌ను బెదిరించి వారి భవనాన్ని తక్కువ రేటుకు కొనుగోలు చేసిన విషయం అందరికీ తెలుసన్నారు. ఇక నుంచి మీరు చేసే అరాచకాలను ఎండగట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రమౌళి, లక్ష్మీనారాయణ, సుబ్బారెడ్డి, ఆదిరెడ్డి, మురళియాదవ్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. తెప్పోత్సవం



వేడుకగా సాగుతున్న తెప్పోత్సవం

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూలాపేటలో ఆదివారం రాత్రి లక్ష్మీదేవి, చెంచులక్ష్మి సమేత వేదగిరి లక్ష్మీనృసింహస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవం నేత్రపర్వంగా సాగింది. వేదమంత్రోచ్ఛారణలు, రంగురంగుల విద్యుద్దీపాలంకరణలు, బాణసంచా వెలుగులు, సర్వాలంకార శోభితంగా కొలువైన స్వామివారిని భక్తజనసందోహం నడుమ తెప్పోత్సవం గావించారు. సాంప్రదాయాలను అనుసరిస్తూ అర్చకులు కార్యక్రమాలను పూర్తి చేశారు.

ఎస్టీలకు ఉపాధి కల్పించాలి



నెల్లూరు(అర్బన్) : పనులు కల్పించాలని అడగలేని స్థితిలో ఉన్న ఎస్టీలను గుర్తించి వారికి పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఉపాధిహామీ క్షేత్ర సహాయకులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఉపాధి హామీ పథకం అమలుపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ఉపాధి పనులు ఉపయోగపడుతాయన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం సంచాలకుడు షణ్ముఖకుమార్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా రైతులు ఫామ్‌పాండ్స్ ఎక్కువగా తవ్వించుకునేందుకు సహకరించాలన్నారు. డ్వామా పీడీ గంగాభవాని, క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపిచంద్, డ్వామా ఫైనాన్స్ అధికారి కనకదుర్గాభవాని, ఫీల్డ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు సిటీ : నగరంలోని ఒకటో డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది నెలల్లో ఒకటో డివిజన్‌లో రూ.3.50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జానా నాగరాజు, రామ్మోహన్ యాదవ్, టీడీపీ నాయకులు కోడూరు కమలాకర్‌రెడ్డి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్, కమిషనర్



వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి



జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో..




శ్రీపొట్టిశ్రీరాములు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

నెల్లూరు(అర్బన్): ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగం చరిత్రలో చిరస్మరణీయమని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆయన విగ్రహానికి కలెక్టర్ ఆనంద్, కమిషనర్ సూర్యతేజతో కలిసి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగాలు అజరామం అన్నారు. బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మి, పలువురు ఆర్యవైశ్యనాయకులు పాల్గొన్నారు.

- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య నాయకుడు బ్రహ్మంగుప్త మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహాన్ని పార్లమెంట్‌లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ సంక్షేమశాఖ కార్యాలయ సూపరింటెండెంట్ శ్యాంసుందర్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- నగరంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు, ఇతర అధ్యాపకులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరీక్షల కమిటీ సభ్యులు దీనదయాళ్, వేణుగోపాల్, కొండయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- నగరంలోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, పలువురు డాక్టర్లు, సిబ్బంది పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి పరిపాలనాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.
- నెల్లూరు సిటీ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.
- నెల్లూరు (పొగతోట) : స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో శ్రీపొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అధికారులు పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీ సీఈఓ విద్యారమ, ఉద్యోగ సంఘ నాయకుడు పెంచలయ్య, పరిపాలనా అధికారులు రవికుమార్, రాజశేఖర్, ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, ఉమాశంకర్, రమేష్‌బాబు, బీమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- నెల్లూరు(బారకాసు) : నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అమరజీవి ఆశయాలకు అనుగుణంగా తమ పార్టీ పనిచేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- స్థానిక ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ పూలమాల వేసిన ఘన నివాళులర్పించారు.
- నెల్లూరు(బృందావనం) : స్థానిక స్టోన్‌హౌస్‌పేట వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి శ్రీపొట్టిశ్రీరాములు వాకర్స్ నెల్లూరు ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. అనంతరం పేదలకు గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సంఘ అధ్యక్షుడు శింగంశెట్టి మురళీమోహన్‌రావు, సంఘ గౌరవాధ్యక్షుడు పప్పు నారాయణ, సలహాదారు వై.రవి, కార్యదర్శి జి.సుబ్రహ్మణ్యం, కోశాధికారి ఎన్.హరనాథ్‌రెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎ.జయప్రకాష్, శ్రీమన్నారాయణ, రామచంద్ర పాల్గొన్నారు.
- స్టోన్‌హౌస్‌పేట వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి అంతర్జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ (ఐహెచ్ఆర్‌పీసీ) ఏపీ చీఫ్ జనరల్ సెక్రటరీ, మదీనా వాచ్ గ్రూప్ చైర్మన్ ఇంతియాజ్ నివాళులర్పించారు.

వామన త్రివిక్రమ స్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం) : రంగడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శెట్టిగుంటరోడ్డు లక్ష్మీపురం పద్మశాలి వీవర్స్ కాలనీసెంటర్‌లో ఉన్న వామన త్రివిక్రమ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. రంగనాథస్వామి అన్నదాన సమాజం ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో ఉదయభాస్కర్, ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, సంఘ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల ఆత్మీయ సమావేశం



గిరిధర్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని రాంజీనగర్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ సిటీ కార్యాలయంలో 14వ డివిజన్ నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఇన్‌చార్జిగా కొండమరెడ్డి గిరిధర్‌రెడ్డిని ఎంపిక చేసినట్లు ఎమ్మెల్సీ, సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సిద్ధిక్, నాయకులు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వర్లురెడ్డి, జయరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, దశరథరామిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తిరుపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, అశోక్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

వాకర్స్‌కు అవగాహన సదస్సు



నెల్లూరు(బృందావనం) : ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దంత సంబంధ వ్యాధులు, సంరక్షణపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. దంత వైద్యుడు ఆర్.చక్రపాణి దంతరక్షణపై వాకర్స్‌కు అవగాహన కలిగించారు. కిలారి శ్రీనివాసులునాయుడు, గువ్వల నారాయణరెడ్డి, మాగంటి ప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, హరిబాబునాయుడు, నసీర్‌అహ్మద్, శివయ్య, చెంచయ్యనాయుడు పాల్గొన్నారు.

- ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి గుండెవ్యాధి నిపుణుడు డాక్టర్ సాహెబ్‌పీర్ పలు సూచనలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పాబోలు సత్యనారాయణ, కార్యదర్శి స్నేహసురేష్, కోశాధికారి గాలి రఘురామనాయుడు, వేలూరు రంగారావు, కనకట్ల రఘురామ్‌ముదిరాజ్, అరిగెల సాయిరాం పాల్గొన్నారు.